# గృహోన్ముఖంగా





డా॥ వి. చంద్రశేఖరరావు



ఉదయాన్నే ఐదు గంటలకు నిద్రలేచాడు రాజ సుందరం. ఒక్కడే వంట గదికి వెళ్లి, కాఫీ కలుపు కున్నాడు చాలా డికాక్షన్ వేసుకొని, చేదుగా, తీయగా, జేగురురంగు జ్ఞాపకంలా. పాత డఫెల్ బ్యాగ్‌లో జత బట్టలు సర్దుకొని హడావుడిగా ఇంటిలోంచి బయటపడ్డాడు. మంచుతెరల్ని చీల్చు కుంటూ, పేవ్ మెంటు అంచునే నడుచుకుంటూ వెళుతుంటే కారులో తప్ప బయటకు వెళ్లని మనిషి ఇలా నడుచుకుంటూ వెళ్లటం, అప్పుడే నిద్రలేచిన అతని భార్య ఆశ్చర్యంగా చూసింది. గత వారంగా అతని ప్రవర్తనలో కనిపిస్తున్న వింత మార్పుల్లో ఇదీ ఒకటని సరిపెట్టుకుంది.

అతను స్టేషన్‌కు వెళ్లేసరికి అతను ఎక్కాల్సిన రైలు కొద్ది నిమిషాల క్రితమే వెళ్లిపోయింది. ఫ్లాట్‌ఫారంపై చాలాసేపు అట్లాగే నిస్పృహతో నిలబడి, స్పెషల్ ట్రైన్ ఏదో మరో రెండు గంటలలో ఉందన్న ఎనౌన్స్ మెంటు విని, "ఇంకా కాస్త ఆశ మిగిలి ఉంది. ఈ కొద్దిపాటి సమయం చాలు, సమస్తాన్ని రక్షించుకోవచ్చు" అను కున్నాడు.

స్టేషన్‌లో యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. స్టాల్స్ అన్నీ మూసేశారు. వెయిటింగ్ రూమ్‌లన్నీ పోలీసులు, జవాన్లతో నిండి ఉన్నాయి. అక్కడ బెంచీలపై, బల్లలపై, గోడల పక్కనా, స్తంభాల పైనా, ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడ తలల్ని వాల్చుకొని నిద్రపోతు న్నారు. వాళ్ల పక్కన తుపాకీలు గోడలకు, బల్లలకు ఆనించబడి, మౌనంగా, నిర్లిప్తంగా అన్ని వైపులకు చూస్తున్నాయి.

అలజడిగా, కేకలతో, అరుపులతో సముద్రంలా ఉండాల్సిన స్టేషన్ ఆశ్చర్యంగా నిశ్శబ్దంగా ఉంది. సముద్రం ఒడ్డున చలికి వణుకుతూ మునగదీసుకొని కూర్చున్న పెంగ్విన్ పక్షుల్లా ఉన్నారు జనం. ఫ్లాట్‌ఫారం పైనున్న టీవీలోంచి నిరంతర వార్తలు వినిపిస్తు న్నాయి. టీవీ తెరలన్నీ ఎర్రటి వెడల్పాటి రక్తపు మరకల్లా కన్పిస్తు

న్నాయి. చలిలో వణుకుతూ, ఆవులిస్తూ, అసహనంగా అటూ ఇటూ తిరుగుతూ, గుట్టలు గుట్టలుగా పడి ఉన్న జనం మధ్య అతను ఖాళీ చూపులతో, కొన్ని గంటల తరువాత రాబోయే ట్రైన్ కోసం ఎదురు చూస్తున్నాడు.

అతను తన యింటికి వెళుతున్నాడు తల్లిదండ్రుల్ని కలుసు కోవడానికి, దాదాపు పదేళ్ల తరువాత. నిన్న సాయంకాలం ఏడుగంటల సమయంలో, అతను తన జీవితాన్ని ముగించాలని గట్టి నిర్ణయం తీసుకొన్న క్షణంలో వాళ్ల అమ్మ దగ్గర నుంచి ఫోను వచ్చింది. వాళ్లమ్మ మాటలు అతని శరీరం మొత్తాన్ని తడిమినట్లుగా అనిపించింది. "నిన్ను చూడాలనిపిస్తుందయ్యా ఒకసారి రాయ్యా" అని బతిమి లాడింది. అతనికంతా కంగారుగా, కొత్తగా ఉంది. కళ్లనిండా నీళ్లు, చాలా దుఃఖం, కొంచెం ఆనందం, ఇప్పుడీ ప్రయాణం.

మూడు వారాల క్రితం అతనికెందుకో చనిపోతే బాగుండు అనిపించింది. అదీ తుపాకీతో తనను తాను కాల్చుకుంటే బాగుండు అనిపించింది. అప్పటికే అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం తాలూకు మబ్బులు అటూ ఇటూ వ్యాపించి చివరికి అతను పనిచేసే కంపెనీకి కూడా పాకాయి. లాప్‌టాప్‌లు, కంప్యూటర్ విడిభాగాలు తయారు చేసే కంపెనీ అది.

ఉద్యోగం పోయే పరిస్థితి. మూడు నెలల నోటీసు ఇచ్చారు. మూడు నెలల తరువాత అతని అవసరం కంపెనీకి లేదన్నారు. అవేమీ కారణాలు కాదుగానీ, ఎందుకో అతనికి చనిపోతే బాగుండు అనిపిం చింది. విసుగ్గా, అనీజీగా ఉండే సమయంలో ఒకసారి తుపాకీని తనవైపు గురిపెట్టుకోవటమనే ఆలోచన కలిగితే ఏదో రిలీఫ్ లాంటి భావం అతనిలో కదలాడేది. రిలీఫ్ అనే మాట పదేపదే గొణుక్కోవడం మొదలుపెట్టాడు. క్రమంగా ఈ చనిపోవడం అనే విషయం అతనికో ఇష్టమైన ఊహ అయింది. తను చనిపోయినది మొదలుగా, ఆ తరు వాత జరిగే వందలాది దృశ్యాల్ని ఊహించుకుంటే ఎంతో ఎగ్జయిట్ మెంట్ కలగడం అతను గమనించాడు.





చివరకు ఒకరోజు ఉదయం నిజంగానే చనిపోవడానికి నిర్ణయించ కున్నాడు. వారం రోజుల తరువాత ఒక శుక్రవారాన్ని ఎంపిక చేసుకొని, ఆ రోజున, సరిగ్గా రాత్రి పన్నెండుకు చనిపోవాలనుకున్నాడు. తుపాకీతో కాల్చుకొని మాత్రమే చనిపోవాలనుకున్నాడు.

అలా నిర్ణయం తీసుకున్నాక ఇంకా సరిగ్గా వారంరోజులే గడువు అనుకున్నాక, ఆ రోజు బ్యాంక్‌లోంచి డబ్బులు డ్రా చేసి, ఒక అపార్ట్‌మెంట్‌కు డబ్బులు కట్టాడు. ఆ కాగితాలన్నీ కవర్‌లో పెట్టి, వారం తరువాత తన భార్యకు అందేలా ఏర్పాటుచేశాడు. సెల్‌ఫోన్ (ఐ-ఫోన్) కొని సరిగ్గా వారం తరువాత తన కొడుక్కు డెలివరీ చేసేలా ఏర్పాటు చేశాడు. తన అంత్యక్రియల నుంచి వస్తూనే వాటిని చూసి వాళ్లలో కలిగే ఆశ్చర్యమో, ఉద్వేగమో, లేదా దుఃఖమో ఊహించుకుంటూ ఆ రోజంతా గడిపాడు.

అతని జీవితంలో చివరి వారం ఇది. కౌంట్ డౌన్ మొదలైంది. రాత్రిపూట అందరూ నిద్రపోయే వేళ. ఒక్కడే తన గదిలోకి వెళ్లి, కుర్చీలో కూర్చుని (అట్లాంటి దృశ్యాన్ని ఏదో సినిమాలో చూసినట్లు గుర్తు) తుపాకీని తనవైపు గురిపెట్టుకొని, మళ్లీ కాసేపటికి దాన్ని బీరువాలో బట్టల కింద పెట్టేవాడు. ఆ రోజంతా ఇదే ప్రహసనం.

ఆ మరుసటిరోజు అతను నిద్రలేచేసరికి, అమెరికన్ షేర్ మార్కెట్ పతనం గురించి వార్తలు వస్తున్నాయి టీవీలో. ఎకనామిక్ టైమ్స్‌లో అతను ఇన్వెస్ట్ చేసిన షేర్లన్నీ మునిగిపోయాయి. దాదాపు నలభై లక్షలు నష్టం వచ్చింది. స్టాక్‌మార్కెట్ భవనానికి వెళ్లాడు. చుట్టూ వందలాదిగా జనం. దిగులుతో, భయంతో నమ్మలేనితనంతో. ఆరోజు అతని ఆఫీసులో కూడా అదే పరిస్థితి. ఇరవై నాలుగుమందిని ఫైర్ చేసారు. అప్పటివరకూ పక్కన కూర్చున్నవాళ్లు హఠాత్తుగా అదృశ్యం అయ్యారు. వాళ్ల గురించి ఎవరూ మాట్లాడుకోవడం లేదు. కర్ఫ్యూ విధించబడ్డ ప్రాంతంలా ఉంది ఆఫీసు. అతనికి ఇరుకుగా, ఇబ్బందిగా, ఊపిరాడనట్లుగా అనిపించసాగింది.

బయటకు అతను గంభీరంగానే ఉన్నాడు. లోపల జరిగే సంచలనాల గురించి, ఎవరూ ఆనవాలు పట్టలేనట్టుగా, ముఖం కాస్త వెడల్పుచేసి, నుదిటిపై నాలుగు ముడతలు వచ్చేలా ముఖాన్ని బిగించి, ఎగ్జిక్యూటివ్ ముఖాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఉదయాన్నే నిద్ర లేవగానే అన్ని దుస్వప్నాల్ని లోపలికి కుక్కి, ముఖాన్ని శుభ్రంగా తుడిచి, దాన్ని షవర్ కింద సబ్బుతో కడిగి, కాస్త ఫెయిర్ అండ్ లవ్లీ పూసి పైన పౌడర్ పులిమి ఆఫీసుకు తయారవుతాడు. భార్యతో చనువు, ప్రేమ నటించి, నాలుగైదు జోకులు వేసి ఆఫీసుకు బయలు దేరతాడు. నీలిరంగు షర్టు, జీన్‌ప్యాంట్, బట్టతలపై తగు మాత్రపు సెంట్ జల్లుకొని, పర్స్, తాళాలు, బ్రీఫ్‌కేస్‌తో రోడ్డు పైకి వస్తాడు. ఆఫీసులో కూర్చున్నాక, కేలండర్ వైపు చూస్తూ శుక్రవారం దగ్గర ఉలిక్కిపడతాడు. ఆ విషయాన్ని గుర్తు చేసుకోగానే అతని లోపల సమస్తం వదులవుతున్నట్లు, శరీరం బరువు తగ్గి, రెక్కల్లాంటివేవో మొలిచినట్లు అనిపిస్తుంది.

ఆ రోజు లంచ్ అవర్లో, స్టాఫ్ అంతటికీ, సైకలాజికల్ కౌన్సి లింగ్ ఏర్పాటుచేశారు. అప్పుడప్పుడు టివీల్లోనూ, న్యూస్ పేపర్ కాలమ్స్‌లోనూ కనబడే ఒక సైకాలజిస్ట్‌ను పిలిచారు. (సైకాలజిస్ట్, హిప్నోటిస్ట్ లేదా మెజీషియన్ లేదా అన్నీనా, పోనీ ఒట్టి క్వాక్‌నా, చూద్దాం ఫ్రీ ఎంటర్‌టైన్‌మెంట్ అనుకున్నారు స్టాఫ్).

ముందుగా అందరికీ ఒక ప్రశ్నాపత్రం ఇచ్చాడు. ఎ, బి, సి, డి ల్లో ఒకదాన్ని టిక్ చెయ్యమన్నారు. ఆ ప్రశ్నల్లో "మీకు ఎప్పుడైనా చనిపోవాలని కోరిక కలుగుతుందా" అనే ప్రశ్న చూసి అతను ఉలిక్కి పడ్డాడు. తన మనసును పబ్లిక్‌గా ఎవరో చదువుతున్నట్లుగా అనిపించింది. ముందు కూర్చున్న ఒక కుర్రవాణ్ణి లేపి, తల్లిదండ్రుల గురించి అడిగాడు సైకాలజిస్టు. ఎన్నాళ్లయింది వాళ్లను చూసి వగైరా ప్రశ్నలు అడుగుతున్నాడు. అతను క్షణం పాటు ఉలిక్కిపడ్డాడు. ఎన్నేళ్లయింది అమ్మా వాళ్లను చూసి ఐదా, ఆరా, గుర్తే లేదు. అమ్మ ముఖం కళ్ల





ముందు కదలాడింది. అతనికి వాళ్ల పల్లెటూరు గుర్తుకొచ్చింది. వాళ్ల కొబ్బరితోట, వాళ్ల నాన్నతో కలిసి చెట్టుపై నుండి కాయలు దించటం, తోటలో అతను ఆడుకున్న ఆటలు, కొబ్బరిచిప్పలతో అతను చేసుకొన్న టమటమాల బండి, అతని కొత్త సైకిల్, చెట్లపై అతను చెక్కిన రాజసుందరరావు సన్ ఆఫ్ రామచంద్రరావు పేరు.

సైకాలజిస్టు కన్నీళ్ల గురించి చెబుతున్నాడు. "మలం, మూత్రంలాగే కన్నీళ్లు మనలోని మలినాల్ని బయటకు తోడేస్తాయి," అని చెప్పి, "ఏడవండి, మనసారా ఏడవండి, మగవాళ్లు ఏడవకూడ దనే నాన్సెన్స్ పట్టించుకోకండి. లోపలి బరువంతా దిగిపోయి, మీరు తేలికపడేదాకా ఏడవండి. ఆత్మీయుల భుజాలపై తలలు పెట్టుకొని మరీ ఏడవండి," అన్నాడు.

అతను ఆశ్చర్యంగా వింటున్నాడు. సైకాలజిస్టు తన లెదర్ బాగ్ తెరిచి కొన్ని గాజుసీసాలను బయటికి తీశాడు. ఆ సీసాల్లో రంగు లేని, నీళ్లలాంటి ద్రవాలు ఉన్నాయి. ఒక సీసాను వాళ్లకిచ్చి "ఇవి కన్నీళ్లు, వాసన చూడండి. మీలో అజ్ఞాతంగా ఉన్న ఏవో స్మృతుల్ని మేల్కొల్పుతాయి" అన్నాడు.

అందరూ వాసన చూశారు. అక్కడ ఉన్నవాళ్లలో కలకలం. అతనూ వాసన చూశాడు. పరిచితమైన వాసన. చిన్నప్పుడెప్పుడో కాలికి గాయమై వాళ్లమ్మను చుట్టుకొని కార్చిన కన్నీళ్ల జ్ఞాపకం. "ఇదిగో ఇది వాసన చూడండి," అంటూ మరో సీసా ఇచ్చాడు సైకాలజిస్టు. "ఇవి ఆడవాళ్ల కన్నీళ్లు. భగ్గుమని పైకిలేచే దుఃఖం." సైకాలజిస్టు ఒక్కొక్క సీసానే వాళ్లకు ఇస్తున్నాడు.

"ఇది నిశ్శబ్దపు దుఃఖం, ఇవి గొప్ప ఆశాభంగం కలిగినప్పటి కన్నీళ్లు, అవి మరణభయంతో కార్చినవి. ఇవి కలల విధ్వంసం తరువాత వచ్చేవి. ఒక్కో సీసా వాసన చూస్తుంటే, అతనిలో, భయం లాంటిది, ఆశ్చర్యంలాంటి గగుర్పాటులాంటి భావమేదో. "చివరిగా ఇది చూడండి" అంటూ ఒక పొడవాటి సీసాను ఇచ్చాడు సైకాలజిస్టు.

హాస్పటల్ వాసన వేసింది. ఏంటి సెప్టిక్ వాసన, బెడ్‌పాన్‌లో నిలువ ఉన్న మూత్రపు వాసన, ఎండిన రక్తపు వాసన, చాలాకాలం రసిక, చీము కారుతున్న గాయం వాసన, శరీంలోకి నీడిల్ ద్వారా ప్రవేశిస్తున్న మందువాసన, జబ్బు వాసన, శవం వాసన, శవాలు గుట్టలుగా పడి ఉన్న మార్చురీ వాసన. అతడు పెనుభయంతో కేక వేశాడు. అందరూ అతనివైపు చూశారు. అతని ముఖం నిండా చెమటలు. వణికి పోతున్నాడు. ముఖాన్ని చేతులతో కప్పుకొని, సమూహాన్ని వదిలి, తన గదిలోకి పరిగెత్తాడు.

ఆ రోజు మధ్యాహ్నమే అతను ఆఫీసు నుండి వచ్చేశాడు. అతని శరీరంలో వింత ప్రకంపనలు. పూర్తిగా వివరించలేని భయం. కారు రోడ్డు మధ్యలో ఆగిపోయింది. ట్రాఫిక్ జామ్, పెంటాస్టాఫ్ బిల్డింగ్ ఎదుట వందలాదిగా మూగి వున్నారు. ఏ హెచ్చరిక లేకుండా ఉద్యోగాల్లోంచి పీకెయ్యబడ్డవాళ్లు. వాళ్లు నినాదాలు, ధర్నాలు వగైరాలు ఏమీ చెయ్యటంలేదు. మౌనంగా నిలబడ్డారు. అతను కారు దిగి, రోడ్డుపైకి వచ్చి కాసేపు ఆ గుంపు పక్కనే నిలబడ్డాడు. సరిగ్గా ఆ సమయంలో ఒక భయానక దృశ్యం. ముందు వరుసలో ఉన్న ఒక కుర్రాడు హఠాత్తుగా తన లాప్‌టాప్ బ్యాగ్ తెరిచి, సన్నటి ఎలక్ట్రా నిక్ రంపాన్ని బయటకు తీసి, దానితో తన కంఠాన్ని కోసుకున్నాడు. అంతా క్షణాల వ్యవధిలో జరిగింది.

చుట్టూ ఉన్నవాళ్లు హాహాకారాలు చేశారు. గాడ్ అనుకుంటూ నుదిటిపై బలంగా కొట్టుకున్నాడు అతను. కంఠం సగానికి తెగి, రక్తం ఫౌంటెన్‌లా చిమ్మింది. అతనికంతా కలలా ఉంది కళ్లు తిరుగు తున్నట్లు కడుపులో కెలుకుతున్నట్లు, వాంతి వస్తున్నట్లు. జనం చెల్లా చెదురై, ఆ కుర్రాడి శవం ఒక్కటే నేలపై పడి ఉంది. అతను పరిగెత్తు కుంటూ వెళ్లి కారులో కూర్చున్నాడు.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు. వేకువజామున కలత నిద్రలో వింత కల వచ్చింది. అతను ఎప్పటిలాగే ట్రిమ్‌గా తయారయి





ఆఫీస్‌కు వెళుతూ, టక్ చేసుకొని, టై కట్టుకొని, బ్రీఫ్‌కేస్‌కు బదులు తలని చేతిలో పట్టుకుని ఉన్నాడు. అతనే కాదు, ఆఫీసులో అందరూ తెగిన తలల్ని చేతుల్లో పట్టుకొని తిరుగుతున్నారు. తలను టేబుల్‌పై పెట్టి లాప్‌టాప్‌ను తల దగ్గరికి జరిపి, టక, టకా...

ఆ మరుసటి రోజు ఆలస్యంగా నిద్రలేచాడు. కల అతన్ని తరుముతున్నట్టే ఉంది. భార్యను పలకరించకుండానే, కొడుకుకు "బై, నాన్నా!" అని చెప్పకుండానే ఆఫీసుకు బయలుదేరాడు. తోవలో నాలుగైదు పేపర్లు కొనుక్కున్నాడు. ఆఫీసులో కూర్చుని పేపర్లన్నీ బయటకు తీశాడు. పేపరు నిండా ముంబాయి పేలుళ్ల గురించిన కథనాలు. చావు, చనిపోవటం లేదా చంపబడటం లాంటి వార్త లన్నిటినీ ఎర్రటి పెన్‌తో అండర్‌లైన్ చేశాడు.

పేపర్ చదువుతూ పక్కకు తిరిగి కిటికీలోంచి రోడ్డుపైకి చూశాడు. అతనికి ఎదురుగా ఉన్న బిల్డింగ్ ఒక్కసారిగా కూలి పోయింది. (హఠాత్తుగా కూలిందా, ఎవరైన కూల్చేశారా అని అతను ఆలోచించలేదు) కూలిపోవడం అనే దృశ్యాన్ని కళ్లు తెరుచుకొని చూశాడు. కానీ ఆశ్చర్యం. అంతటి బిల్డింగ్ కూలిపోతే చప్పుడేమీ కాలేదు. దుమ్ము పైకి ఎగరలేదు. హాహాకారాలు వినబడలేదు. భయ పెట్టే ప్రశాంతత. రోడ్డు ఏమీ తెలియ నట్లు, అమాయకంగా, ఎప్పటి లాగే ప్రవహిస్తోంది. అతనట్లా చూస్తుండగానే మరో బిల్డింగ్ కూడా అట్లాగే నిశ్శబ్దంగా కూలిపోయింది. అతను ఆకాశం వైపు చూశాడు. భగవంతుడో లేదా ఆయన ప్రతినిధో, అట్లా ఒకదాని తరువాత ఒకటి కూల్చుకుంటూ వెళుతున్నారేమోనని చూశాడు.

ఆరు గంటలకు అలసిపోయి ఇంటికి చేరాడు. బట్టలు కూడా మార్చుకోకుండా టీవీ ముందు కూర్చున్నాడు. ముంబాయి తీవ్ర వాదుల దాడి దృశ్యాలు, తాజ్ హోటలు దృశ్యాలు, అవయవాలు తెగిపడిన శరీరాలు, రోడ్డు పొడవునా శరీరాలే. ఎవరో ఆ శరీరాల్ని వ్యాన్‌లోకి విసురుతున్నారు. ఇంకెవరో శరీరాల్ని (అవయవాల్ని)

కెలుకుతున్నారు. చుట్టూ ఉన్న జనం ఉద్వేగాలు లేనట్లుగా ఆ శవాలవైపే చూస్తున్నారు. ఎవరూ ఏడవకపోవడం అతనికి ఆశ్చర్యంగా ఉంది.

ఛానెల్ మార్చాడు. N.S.G. కమాండోలకు తీవ్రవాదులకు మధ్య జరుగుతున్న యుద్ధం అక్కడా శవాలే. నేల పొడవునా పరిచి నట్లుగా, మరో చానెల్‌లో సెన్సెక్స్ వార్తలు, మార్కెట్ల భారీ పతనాలు, దేశాలపై కమ్ముకుంటున్న ఆర్థికమాంద్యం మేఘాలు. మనుషులే అదృశ్యం అయినాక, ఇక మార్కెట్లు ఏమైతేనేం అనుకున్నాడు.

సరిగ్గా ఆ ఊహ దగ్గరకు వచ్చాక అతను తన మొత్తం ఊగిస లాటను ఆపేశాడు. ఇక, ఇది చివరి రాత్రి కావాలి అనుకున్నాడు. కళ్లను లోపలికి తిప్పుకొని, లోపలంతా వెతికాడు. మొత్తం ఖాళీగా కనిపించింది. ఇసుక బస్తాలోంచి ఇసుకంతా కారిపోయినట్లుగా. ఇన్ని ఏళ్లలో లోపలిదంతా తోడివేయబడి మొత్తం ఖాళీ అయిపోయి, ఒట్టి గూడు మిగిలి, ఏ క్షణంలోనైనా కూలిపోయేటట్లుగా ఉంది. ఇంక చాలు, ఇంక చాలు అని రెండుసార్లు గట్టిగా అనుకున్నాడు.

సాయంకాలం ఏడయింది. వంటగదిలోకి వెళ్లి కాఫీ చేసు కున్నాడు. చాలా డికాక్షన్ వేసుకున్నాడు. చేదుగా, తీయగా ఇట్లాగే బాగుంది అనుకున్నాడు. కాఫీ కప్పును అట్లాగే టీపాయ్ మీద పెట్టి ఇంటిలోని గదులన్నీ తిరిగాడు. ఒక్కో ప్రదేశాన్ని చేతులతో తడిమాడు. భార్య గదిలోకి వెళ్లాడు. అప్పుడే స్నానం చేసి వచ్చినట్టుంది. వడలి పోయినా ఇంకా అందంగా ఉన్న శరీరం. తనకు ఇష్టమైన, ఒట్టి స్పర్శ తోనే ఉద్రూతలూగించే ఆమె శరీరంవైపు నిర్లిప్తంగా చూశాడు. (ఆమె అతని ఉనికిని గమనించినట్లు లేదు) కొడుకు గదిలోకి వెళ్లాడు. ఐదేళ్ల వయసులో ఉన్న వాడి ఫోటోను చేతితో ముట్టుకొని, ఫోటోలోని వాడి ముఖాన్ని ప్రేమగా నిమిరాడు. తన గదిలోకి వెళ్లి పాత సూట్‌కేస్‌ని తెరిచి తన డైరీలన్నిటినీ బయటికి తీసి, ఒక్కోపేజీ వందలాది ముకలు గాచించి, డస్ట్‌బిన్‌లో వేశాడు. ఆ కార్యక్రమం చాలాసేపు పట్టింది. మళ్లీ తను కాఫీ పెట్టిన గదిలోకి వచ్చాడు.





కాఫీ కప్పు పై సాసర్ని మూతపెట్టి, తుపాకీ ఉన్న గదిలోకి వెళ్లాడు. ఆ గదిలోకి అడుగుపెడుతుండగా అతనికి ఫోన్ వచ్చింది. వాళ్ల ఊరు నుంచి, వాళ్లమ్మ చేసిన ఫోను.

వాళ్ళమ్మ గొంతు, కర్ణభేరి ద్వారా లోపలెక్కడికో ప్రయాణించి, ఆత్మగృహమంతా అమ్మ జ్ఞాపకంతో నిండిపోయింది. అప్పటిదాక ఉన్నదంతా అదృశ్యం అయి, అమ్మను చూడాలనే కోరికొక్కటే మిగిలింది.

కప్పులో చల్లారిపోయి, తీయగా చేదుగా ఉన్న కాఫీ అతని కోసం ఎదురుచూస్తూనే ఉంది.

నిశ్శబ్దంగా, యుద్ధానంతర సన్నివేశంలా ఉన్న స్టేషన్‌లో ఒక మూలన గోడకు ఆనుకొని నిలబడ్డాడు రాజసుందరం. అతనికి అటూ, ఇటూ మనుషులు, వాళ్ల శరీరాల బరువంతా అతనిపై పడి అతనికి భరించ లేనంత ఇరుకుగా ఉంది. వందలాదిగా మనుషులు శవాల గుట్టల్ని పేర్చినట్టుగా ఒకరిపై ఒకరు. రాజసుందరంకి అనీజీగా ఉంది. అక్కడ నుంచి పారిపోవాలనిపించింది. అతి కష్టం మీద తన శరీరంపై పడిన అవయవాల బరువును విడిపించుకొని, ముందుకు నడిచాడు. అక్కడా జనం- ఇంతమంది జనం ప్రపంచమంతా ఒక ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నట్లుగా.

ఎనౌన్సుమెంటు కూడా లేదు. ట్రైన్ ఎప్పుడొస్తుందో కూడా తెలియడం లేదు. ప్లాట్ ఫాం చివరకు వెళ్లి గట్టిగా ఊపిరిపీల్చుకొని (అతని మనసులో రిలీఫ్ రిలీఫ్ అని మాటలు వినపడ్డాయి. బీరువా లో బట్టల కింద దాచిన తుపాకీ కళ్లలో మెదిలింది) మనుషుల పై నుంచి దృష్టిని మరల్చి, చిరిగిన కాగితాలు, నేలపైని టీ కప్పులు, గోడలపై ఎండిపోయిన ఉమ్మి, కళ్లె, తెగిన ఒంటరి చెప్పు, తన కాళ్లపై వందలుగా ముసిరిన ఈగలు. అతనికా దృశ్యం చూడగానే కడుపులో తెమిలినట్లు అనిపించింది. కాఫీ రంగు వాంతి, అతని బట్టలనిండా, అతని చుట్టూ.

గంట గడిచినాక కూడా వాతావరణంలో మార్పు రాలేదు. అతను ఎక్కవలసిన ట్రైన్ గురించి ఎనౌన్స్‌మెంటు వినబడలేదు.

అతనట్లాగే శవాలలా ఉన్న మనుషుల్ని, నిద్ర నటిస్తున్న పోలీసుల్ని, చుట్టూ ఉన్న మురికిని శబ్దాలు ప్రవహించని ఉదయాల్ని చూస్తూ మురిగ్గా, దుర్భరంగా, శవం కుళ్లినప్పటి వాసన వస్తున్న వాతావరణం లో అట్లాగే నిలబడి 'ఇంకా కాస్త ఆశ మిగిలి ఉంది,' అని తనలో తాను గొణుక్కున్నాడు. సరిగ్గా ఏడుగంటల పది నిమిషాలకు తనకు వంద అడుగుల దూరంలో నిలబడ్డ ఒక మనిషివైపు చూసి క్షణం పాటు విభ్రమకు, షాక్‌కూ గురయ్యాడు. అక్కడొక మనిషి చాలా సేపటి నుండి, అతనివైపే చూస్తూ అతని కదలికల్ని ఆలోచనల్ని నోట్ చేసుకుంటున్నట్లుగా ఉన్నాడు. పైగా అతను అచ్చం రాజసుందరం లాగే ఉండటం- రాజసుందరం భయంతో వణికిపోయాడు. ఆ మనిషి ముఖం పై సన్నటి చిరునవ్వు ధరించి ఉన్నాడు. కళ్లలో కాంతి లాంటిదో, శాంతి లాంటిదో, రాజసుందరానికి కంగారుగా ఉంది. ఆశ్చర్యంగా ఉంది. అతనివైపు నడిచాడు.

'నువ్వ ఎవరివి? నాలాగే ఎందుకు ఉన్నావు' అని అడగాలను కొని అతని రూపంలోని సౌందర్య మోహనాన్ని చూసి మాటలు రాక ఉండి పోయాడు. అతనే పలకరించాడు, "ఈ ఎదురుచూడటం దుర్భరంగా ఉంది కదూ" అన్నాడు. "అవును, ఈ దుమ్ము, దుర్గంధం, ఈ శవాల లాంటి మనుషులు, దుర్భరం, తట్టుకోలేనట్లు ఉంది" అన్నాడు రాజసుందరం.

ఎదురుచూడటం దుర్భరమే, నరకమే, హింసే, దుఃఖమే కానీ ఎదురుచూడటం అయిపోయాక వచ్చే ప్రయాణాలు ఎంతో ఆనందంగా ఉంటాయి. వాటికోసం ఎదురుచూడక తప్పదు.

"అటు చూడు, అక్కడో చిన్న పాపాయి, నిద్రపోతున్న తల్లి జుట్టుతో ఆడుకుంటూ, ఇటువైపు ఆ ముసలి దంపతులు ట్రైన్‌లో రాబోతున్న కొడుకు కోసం ఎదురుచూస్తూ, వాళ్ల కళ్లనిండా ఎన్ని పూల తోటలు. నాకు ప్లాట్‌ఫారం అంటే ఎంతో యిష్టం. ఇట్లా ఎదురు చూడటం కూడా. ఈ ప్రయాణాల్లో ఎన్ని ఆశ్చర్యాలు, అందాలు ఎదురుకానున్నాయో" అన్నాడు.





అతని మాటలు కాదుగానీ, అతని రూపం ఆశ్చర్యంగా ఉంది. తనలాగే ఉన్నాడు కానీ, అతని ముఖం అంత అందంగా ఉండటం సుందరానికి ఆశ్చర్యంగా ఉంది.

ధైర్యం చేసి "నువ్వు ఎవరివి" అన్నాడు రాజసుందరం.

అతను మృదువుగా నవ్వాడు "నన్నే ఎరుగవా?" అన్నట్టు. ఏదో అనుమానం వచ్చి, "నువ్వు భగవంతుడివా?" అన్నాడు రాజ సుందరం, అతని ముఖంలో నవ్వు చెరిగిపోలేదు. రాజ సుందరానికి తెలియని ఆవేశమేదో వచ్చింది.

"ఎందుకింత దుఃఖాన్ని, మరణాన్ని, ఆకల్ని, కోల్పోడాల్ని, ధనాన్ని, దానిపై వ్యామోహాన్ని, హింసని, ఉన్మాదాన్ని, బతకలేని తనాన్ని మా కిచ్చావు" అన్నాడు.

చుట్టుపక్కల ఉన్న మనుషులు రాజసుందరం వైపు ఆశ్చర్యం గా, అనుమానంగా చూశారు. ఒక చిన్న పాప నోటిపై చేతిని అడ్డుపెట్టు కొని నవ్వుతోంది. ప్లాట్‌ఫాంపై కదలిక మొదలైంది. దూరం నుండి ఇంజన్ కూత వినబడింది. మనుషులు లేచి సామాన్లు సర్దుకొని, ప్రయాణానికి సిద్ధమయి నిలబడ్డారు. కుర్చీలపై కూర్చున్న పోలీసులు, జవాన్లు లేచి తుపాకులు ధరించి ఎటెన్షన్‌లో నిలబడ్డారు.

రాజసుందరం చూస్తుండగానే అతను జనంలోకి అదృశ్య మయ్యాడు. రాజసుందరం అతని కోసం వెతికే ప్రయత్నం చెయ్య లేదు. ప్లాట్‌ఫారంపై చప్పుళ్లు మొదలయినాయి. నవ్వులు, కేరింతలు, పెద్దగా మాట్లాడు కోవటాలు, అరుపులు, మనుషుల సందడితో ప్లాట్ ఫారం అలల సముద్రంలా ఉంది. ఎనౌన్స్‌మెంటు లేకుండానే ట్రైన్ ప్లాట్ ఫారం మీదికి వచ్చింది. జనం తోసుకుంటూ, తొక్కుకుంటూ ట్రైన్ ఎక్కుతున్నారు. 'ఫర్వాలేదు, ఇంకా కాస్త ఆశ మిగిలి ఉంది' అను కుంటూ, ట్రైన్ వైపు అడుగులేశాడు రాజసుందరం.

*సదా స్వాప్నికుడు స్మైల్ జ్ఞాపకంలో...*

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 21 డిసెంబర్ 2008*